క్లుప్తంగా

నేడు విజయోత్సవ సభ



నిజాంసాగర్(జుక్కల్): ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసి మొదటిసారి నియోజక వర్గానికి వస్తున్న తోట లక్ష్మీకాంతరావుకు నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలకాలని నిజాంసాగర్ మండల కాంగ్రెస్ నాయకులు జయప్రదీప్, రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పిట్లం మండలకేంద్రంలోని సాయిగార్డెన్‌లో నిర్వహించనున్న విజయోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు. నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా నుంచి పిట్లం సాయిగార్డెన్ వరకు ద్విచక్ర వాహనాల ర్యాలీ ఉంటుందని తెలిపారు. నాయకులు ఎలె మల్లికార్జున్, ఆకాశ్, లోక్యా నాయక్, ప్రజాపండరి, బాల్‌సాయిలు, రామ కృష్ణాగౌడ్, రామాగౌడ్, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి/సదాశివనగర్: నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, సదాశివనగర్ మండలాల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావును శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ధర్మారెడ్డి సర్పంచ్ శ్రీధర్‌గౌడ్, మాల్తుమ్మెద సొసైటీ మాజీచైర్మన్ రాంచందర్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ గోపాల్, నాయకులు బోయిని విఠల్, నగేశ్, మధు, యాదగిరి, జగపతి, ఎల్లారెడ్డికి చెందిన నాయకులు వినోద్, హరి, భూమయ్య, షేకావత్, సదాశివనగర్ మండల వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చిందం రాజయ్య, గాజుల బాబ్జాని, మార సత్యనారాయణ, ఫయాజ్, బాలాజీ తదితరులున్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



కామారెడ్డి రూరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గౌరీశంకర్ ఆలయంతోపాటు నాగిరెడ్డిపేట మండలం చీనూర్ వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అర్చకులు నర్సింగ్‌రావు, గోపాలాచారి ఆధ్వర్యంలో దంపతులు వ్రతాన్ని ఆచరించారు. దేవునిపల్లిలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నంగునూరి కిరణ్‌కుమార్, కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్, గౌరవ అధ్యక్షుడు కృష్ణమోహన్, బస్వాగౌడ్, బ్రహ్మం, దీకొండ రాజు, కృష్ణాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని భవానిపేటలో మండల పశువైద్యాధికారి రవికుమార్ శనివారం పశువులకు గర్భాశయ పరీక్షలు నిర్వహించారు. 42 గేదెలు, 4 ఆవులకు పరీక్షలు నిర్వహించడంతోపాటు 32 దూడలకు నట్టల నివారణ చికిత్స, 13 పశువులకు సాధారణ చికిత్స చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సురేందర్, సాయిలు, వైద్య సిబ్బంది కృష్ణ, ఎజాజ్, రమేశ్, మల్లయ్య, వెంకట్ పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి గంజ్‌వర్తక సంఘ భవనంలోని హనుమాన్ ఆలయంలో శనివారం ఉదయం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఉదయం 8 నుంచి అరగంటపాటు కొనసాగిన పారాయణంలో మహిళలు, పురుషులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మద్నూర్‌లో ఆధార్ సెంటర్



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో ఆధార్ కేంద్రం కొనసాగుతోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఎన్నికల సమయంలో మద్నూర్‌లో ప్రభుత్వం ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేసిందని, ఇది తెలియక చాలా మంది ఆధార్ కోసం పక్క మండలాలకు వెళ్తున్నారని సిబ్బంది చెప్పారు. మద్నూర్, డోంగ్లీ మండలాల ప్రజలు నూతన ఆధార్ కోసం, ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం స్థానిక ఆధార్ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

ఉచిత ప్రయాణం షురూ

- 'మహాలక్ష్మి' ప్రారంభం



బాన్సువాడలో..



బీబీపేటలో బస్సెక్కుతున్న మహిళలు

బాన్సువాడ/బీబీపేట/తాడ్వాయి/బిచ్కుంద/నస్రుల్లాబాద్/బాన్సువాడ రూరల్/దోమకొండ : రాష్ట్ర ప్రభుత్వం 'మహాలక్ష్మి' పథకాన్ని ప్రారంభించడంతో ఆడబిడ్డలు ఆర్టీసీ బస్సుల్లో శనివారం నుంచి ఉచితంగా ప్రయాణిస్తున్నారు. బస్టాండ్‌లు, బస్సులు మహిళలతో కిక్కిరిశాయి. మహిళలు సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పథకాన్ని బాన్సువాడ బస్టాండ్‌లో సీఐ మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని అన్నారు. బీర్కూర్ బస్టాండ్‌లో కాంగ్రెస్ నాయకులు మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. ఆర్టీసీ డీఎం సరితాదేవి, సిబ్బంది బసంత్, నాయకులు ప్రతాప్‌సింగ్, అజీం, నందురెడ్డి, రూప్‌సింగ్, సాయిలు, శేఖర్‌రెడ్డి, అక్బర్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు. నస్రుల్లాబాద్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందరెడ్డి ఆర్టీసీ బసుకు పూలమాలలు వేశారు. సర్పంచ్ అరిగె సాయిలు, పార్టీ మండల కార్యదర్శి శివప్రసాద్, మాజీ ఎంపీటీసీ శంకర్‌నాయక్, నాయకులు యూసుఫ్, శాంతయ్య పాల్గొన్నారు. బాన్సువాడ మండల జక్కల్‌దాని తండా వద్ద ఆర్టీసీ మహాలక్ష్మి సేవలను కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌సింగ్ ప్రారంభించారు. మండల అధ్యక్షుడు కాట్రోత్ రూప్‌సింగ్ తదితరులు గిరిజన మహిళలతో కలిసి బాన్సువాడ–కామారెడ్డి బస్సులో ప్రయాణించారు.



బీర్కూర్‌లో కేక్‌కట్ చేస్తున్న నాయకులు



బీబీపేటలో వేచిఉన్న మహిళలు



దోమకొండ బస్టాండ్‌లో వేచి ఉన్న మహిళలు



బిచ్కుంద నుంచి ప్రయాణిస్తున్న మహిళలు



తాడ్వాయిలో మహాలక్ష్మి టికెట్ ఇస్తున్న కండక్టర్



జక్కల్‌దాని తండా వద్ద..

మా బతుకులు ఆగం చేయొద్దు



జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో ఆటోలు



తాడ్వాయిలో ఖాళీగా ఉన్న ఆటోలు

- ప్యాసింజర్ ఆటో డ్రైవర్ల ఆవేదన
- ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్
- జిల్లాలో 500లకుపైగా ఆటోలు
- ఆర్టీసీ మహాలక్ష్మితో భారీ ఎఫెక్ట్ అంటున్న డ్రైవర్లు

కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు ఎంతో ప్రయోజనం చేకూర్చనుండగా, తమ బతుకు ఆగమవుతుందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఆదాయం లేక బతుకుభారమవుతుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు. జిల్లా కేంద్రంలోపాటు జిల్లా వ్యాప్తంగా ప్యాసింజర్ ఆటోలు, వాటిని నడిపించే డ్రైవర్లు, యజమానులు సుమారు 500లకుపైగా ఉంటారు. వీరు ప్రతిరోజూ పట్టణాలు, మండల కేంద్రాల నుంచి చుట్టు పక్కల గ్రామాలకు ప్రజల్ని చేరవేస్తుంటారు. ఆర్టీసీ బస్సు చార్జీలతో సమానంగా తీసుకుంటారు. ఇప్పుడు మహిళలందరూ ఉచిత బస్సు ప్రయాణంవైపు మొగ్గుచూపే అవకాశాలు ఉన్నాయని, తమకు ప్రతిరోజూ 50శాతానికిపైగా ఆదాయం తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని అంటున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో రెండు చోట్ల, పాత బస్టాండ్‌లో రెండు చోట్ల, కొత్తబస్టాండ్ చర్చి ముందు, ధర్మశాల, స్టేషన్‌రోడ్లలో ప్రత్యేకంగా ప్యాసింజర్ ఆటో స్టాండ్‌లు ఉన్నాయి.

వెలవెలబోతున్న ఆటోలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : 'మహాలక్ష్మి' ప్రారంభంతో ప్యాసింజర్ ఆటోలు వెలవెలబోతున్నాయి. ప్రతిరోజూ తాడ్వాయి మండలానికి వందల ఆటోలు నడుస్తున్నాయి. మొదటిరోజే తాము ఆదాయం లేక దిక్కుతోచని స్థితిలో పడ్డామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు.

'ప్రభుత్వం పొట్టకొడుతోంది

– నర్సింలు, ఆటో జేఏసీ జిల్లా అధ్యక్షుడు



కామారెడ్డి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ మా పొట్టకొడుతోందని ఆటో యూనియన్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బోదాసు నర్సింలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కామారెడ్డిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణసౌకర్యం కల్పించడంతో మా ఆటోల్లో ఎక్కేవారు ఉండరన్నారు. తమకు మరో ఉపాధి మార్గం చూపని పక్షంలో ఆందోళనబాటపడతామని హెచ్చరించారు. ఉచిత బస్సు పథకంపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.

ఆదాయం తగ్గిపోతుంది



నేను కామారెడ్డి జిల్లా కేంద్రం నుంచి భిక్కనూరు మండలానికి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. నాకు నా కుటుంబానికి ఈ ఆటోనే ఆధారం. మహిళల ప్రయాణికులు ఆటోలు ఎక్కకపోతే మాకు ఆదాయం తగ్గుతుంది. మొదటి రోజే ఆడవారు ఆటోల వద్దకు రాలేదు.

– రాజేందర్, భిక్కనూరు

ప్రభుత్వం ఆదుకోవాలి



ఎన్నో ఏళ్లుగా ఆటో నడుపుతున్నా. ఆటో చక్రం నడిస్తేనే మా కుటుంబం బతుకుతుంది. లేకుంటే పస్తులుంటాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో మా పొట్ట కొట్టారు. ఆటో డ్రైవర్లను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి. లేకుంటే జిల్లాలో వందలాది డ్రైవర్లు, వారి కుటుంబాలు రోడ్డున పడతాం.

– తోట రవి, రాజంపేట

ఓటమికి పూర్తి బాధ్యత నాదే

- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్

ఎల్లారెడ్డి: ఎన్నికల్లో ఓటమికి పూర్తి బాధ్యత తనదేనని, ఎవరినీ నిందించాల్సిన అవసరం లేదని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డిలో బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేసినప్పటికీ, ఎక్కడో లోపం కారణంగా తాను ఓటమి పాలయ్యానన్నారు. గెలుపోటములు సహజమని, ఎమ్మెల్యేగా గెలిచిన సమయంలో పొంగిపోలేదని, ఓటమి చెందితే కుంగిపోవడం లేదన్నారు. కార్యకర్తలు జెండాలు మోసం తనకోసం పని చేశారన్నారు. మున్ముందు స్థానిక సంస్థలఎన్నికలతోపాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీ ఎన్నికలు జరుగనున్నాయని అన్నారు. కలిసికట్టుగా పనిచేద్దామని, పార్టీకి చెందిన వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత తనదేనన్నారు. 25ఏళ్ల తన రాజకీయ జీవితంలో గెలుపోటములను సమానంగా తీసుకున్నానని అన్నారు. రాబోయే రోజులు మనవేనని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ప్రజాతీర్పును గౌరవించాలన్నారు. ప్రజలు, కార్యకర్తల కోసం కామారెడ్డిలో కార్యాలయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. గ్రూపులు కట్టవద్దని, కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, గాంధారి, సదాశివనగర్ జెడ్పీటీసీలు ఉషాగౌడ్, మనోహర్‌రెడ్డి, శంకర్‌నాయక్, ఎంపీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, సొసైటీ చైర్మన్లు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆత్మకూర్‌కు చెందిన పాటిమీది జితేందర్‌రెడ్డిని మాజీఎమ్మెల్యే జాజాల సురేందర్ పరామర్శించారు. జితేందర్‌రెడ్డి తండ్రి శివారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, విషయం తెలుసుకున్న సురేందర్ జితేందర్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయనవెంట నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, నాయకులు వంశీగౌడ్, సంగయ్య, మల్లేశం తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

సదాశివనగర్(ఎల్లారెడ్డి): బీఆర్‌ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పాపనొల్ల బీరయ్య తెలిపారు. ఈమేరకు మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యక్తిగత కారణాలు, పార్టీలో విభేదాల కారణంగానే తాను రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. న్యాయంగా, నిజాయితీగా పని చేసిన వారికి పార్టీలో సరైన గుర్తింపు లేకుండాపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

కేసీఆర్ కోలుకోవాలని పూజలు



మాచారెడ్డి: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరుతూ మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన వీఎస్‌ఎస్ మాజీ చైర్మన్ ఏనుగు దయాకర్‌రావు దంపతులు శనివారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహా స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణను సాధించిన పోరాట యోధుడు కేసీఆర్ త్వరగా కోలుకోవాలని పూజలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

పరీక్షలకు సన్నద్ధం చేయాలి



బాన్సువాడ రూరల్: విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని కామారెడ్డి జిల్లా ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి షేక్ సలాం సూచించారు. మండలంలోని తెలంగాణ మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. అడ్మిషన్లు, సిలబస్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు ఎక్కువ సమయం లేదని 100శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను అధ్యాపకులు సన్నద్ధం చేయాలని ఆదేశించారు. రికార్డులను పరిశీలించి, ల్యాబ్‌ను సందర్శించారు. ప్రిన్సిపల్ ధనలక్ష్మికి పలు సూచనలు చేశారు.

రేపు లక్ష పుష్పార్చన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ శివారులో ఉన్న త్రిలింగ రామేశ్వరాలయంలో లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ చైర్మన్ కొమ్మ దత్తు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పుష్పార్చన కొనసాగుతుందని, భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

కల్యాణ మండపం స్లాబ్ పనులు ప్రారంభం



స్లాబ్ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి మల్లన్న ఆలయం వద్ద నిర్మిస్తున్న కల్యాణ మండపం రెండో అంతస్తు స్లాబ్ నిర్మాణ పనులను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు శనివారం ప్రారంభించారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సొంత నిధులతో స్లాబ్ వేయిస్తున్నారని బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాసర్ల రాజలింగం, ఆకుల భరత్, కౌన్సిలర్ శ్రీనివాస్, చిన్నోళ్ల రజనీకాంత్‌రావు, నిట్టు రఘు, వీడీసీ ప్రతినిధులు రాజుపాటిల్, గూడెల్లి గంగాధర్, కుసుమ సిద్ధిరాములు, రాహుల్, ఉరుదొండ రవికుమార్, సాకలి నర్సింలు, నాగల్ల నర్సింలు, చారి, ఆరేటి శ్రీనివాస్, మీసాల శంకర్, లారా, నిట్టు ప్రభాకర్ రావు తదితరులున్నారు.

డీఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆర్థిక సాయం



రామారెడ్డి(ఎల్లారెడ్డి): పాల్వంచ మండలం సింగరాయపల్లికి చెందిన స్వప్న గత కొన్ని నెలలుగా క్యాన్సర్‌తో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. విషయం తెలుసుకున్న డీఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి స్పందించి బాధిత మహిళకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. శ్రీనివాస్‌రెడ్డికి స్వప్న కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు దూడం స్వామి, రంజిత్, శ్రీనివాస్, రాజేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం సోదరుడిని కలిసిన నాయకులు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డిని శనివారం కలిశారు. ఆయనను కలిసిన వారిలో రాష్ట్ర అధికార ప్రతినిధి నిజాం, టీపీసీసీ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి రఫీయొద్దీన్, షఫీ, జొన్నల రాజు, రాంపల్లితండా సర్పంచ్ పరశురాం, ఇర్ఫాన్, నదీమ్, గోవింద్ తదితరులున్నారు.

క్రీడలు గుర్తింపునిస్తాయి

ఉప్పల్‌వాయిలో రాష్ట్రస్థాయి క్రీడలు ప్రారంభం



అథ్లెటిక్స్‌ను ప్రారంభిస్తున్న ఎస్సై సుధాకర్

రామారెడ్డి (ఎల్లారెడ్డి): క్రీడలు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపునిస్తాయని రామారెడ్డి ఎస్సై సుధాకర్ అన్నారు. ఉప్పల్‌వాయి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో రాష్ట్రస్థాయి క్రీడలను నిజామాబాద్ రీజినల్ కో – ఆర్డినేటర్ అలివేలుతో కలిసి ఎస్సై సుధాకర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాధికారి రామ్‌లక్ష్మణ్, ఇంటర్ నోడల్ ఆఫీసర్ షేక్ సలాం, స్థానిక కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, రైతుబంధు మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి, సర్పంచ్ కొత్తోళ్ల గంగారాం తదితరులు పాల్గొన్నారు

వైభవంగా సహస్ర లింగార్చన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కార్తీకమాసాన్ని పురస్కరించుకొని నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేట హనుమాన్ మందిరంలో శనివారం ఉదయం చందనలేపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు దిగంబరశర్మ ఆలయంలోని స్వామివారికి చందనలేపనం చేశారు. రాత్రి సహస్ర పార్థివమహాలింగార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. లింగాకృతిలో దీపాలను వెలిగించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



జిల్లా కేంద్రంలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు



మాచారెడ్డిలో..

కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ జన్మదిన వేడుకలను జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. పలుచోట్ల సోనియా చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. తెలంగాణ ఇచ్చిన దేవత సోనియా అని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



రామారెడ్డిలో..



భిక్కనూరులో..



ఎర్రపహాడ్ ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్ల పంపిణీ..



బిచ్కుందలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



బీర్కూర్‌లో సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు